# 'గాయత్రి' బ్యాంకింగ్

- జగిత్యాలలో పుట్టి ఆంధ్రప్రదేశ్‌కు విస్తరించిన సేవలు
- ముంబై, పుణె, నాసిక్‌లోనూ శాఖలకు సన్నాహాలు
- 25 ఏండ్ల ప్రస్థానంలో 62 బ్యాంకింగ్ అవార్డులు
- 900 మందికి ఉద్యోగావకాశాలు
- స్వరాష్ట్రంలో ప్రోత్సాహమే ప్రగతికి మార్గం వేసిందంటున్న గాయత్రి బ్యాంక్ సీఈవో వనమాల శ్రీనివాస్

జగిత్యాల, మే 22 (నమస్తే తెలంగాణ): జగిత్యాల కేంద్రంగా 25 ఏండ్ల క్రితం చిన్నగా ఏర్పాటైన గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్.. నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో శాఖలను విస్తరించి తన సత్తాను చాటుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరం అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్, హైదరాబాద్ సమత మహిళా కో-ఆపరేటివ్ బ్యాంక్, భువనగిరికి చెందిన యాదగిరి లక్ష్మీనర్సింహ స్వామి కో-ఆపరేటివ్ బ్యాంకులను విలీనం చేసుకొని దిగ్విజయంగా ముందుకు సాగుతున్నది. త్వరలోనే మహారాష్ట్రలోని ముంబై, పుణె లాంటి నగరాల్లోనూ శాఖల ఏర్పాటుకు బ్యాంక్ సిద్ధమవుతోంది. రెండున్నర దశాబ్దాల్లో 62 బ్యాంకింగ్ అవార్డులను కైవసం చేసుకోవడం ఖాతాదారుల్లో గాయత్రి బ్యాంక్ విశ్వసనీయతకు అద్దం పడుతున్నది.

**చిరు ఉద్యోగి నుంచి..**

కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో చిన్న ఉద్యోగం కోసం ఆశపడిన యువకుడు.. ఓ బ్యాంక్ ప్రారంభానికే పూనుకున్నాడు. జగిత్యాల వాసులు ఇచ్చిన సహాయ,సహకారాలతో ఏర్పడిన కో-ఆపరేటివ్ బ్యాంక్.. ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బ్యాంక్‌గా పేరు సంపాదించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఏటా చిన్న బ్యాంకులకు ఇచ్చే పురస్కారాన్ని వరుసగా 19సార్లు సాధించి అత్యుత్తమ సేవలకు చిరునామాగా నిలవడం గమనార్హం. ప్రస్తుతం గాయత్రి కో-ఆపరేటివ్ బ్యాంక్ రెండు తెలుగు రాష్ట్రాల్లో 62 బ్రాంచ్‌లతో రూ.27 కోట్ల లాభాలతో, 900 మంది ఉద్యోగులతో పురోగమిస్తోంది. ఓ ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేసిన వనమాల శ్రీనివాస్.. చివరకు జగిత్యాలలోనే కో-ఆపరేటివ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం విశేషం. 1998 డిసెంబర్ 31న గాయత్రి బ్యాంక్‌కు ఆర్బీఐ నుంచి అనుమతి వచ్చింది. అలా.. 1,008 మంది ఖాతాదారులతో, రూ.25.08 లక్షల మూలధనం (షేర్ క్యాపిటల్)తో 11 సెప్టెంబర్ 2000వ సంవత్సరంలో బ్యాంక్ ప్రారంభమైంది. అప్పట్లో బ్యాంక్ అధ్యక్షుడిగా ముత్యాల లక్ష్మణ్ రెడ్డి, సీఈవోగా వనమాల శ్రీనివాస్, మరో ఐదుగురు ఉద్యోగులు పనిచేసేవారు.

**ఖాతాదారులకు నమ్మకం కల్పిస్తూ..**

రాష్ట్రవ్యాప్తంగా పలు కో-ఆపరేటివ్ బ్యాంకులు బోర్డులను తిప్పేస్తున్న తరుణంలోనూ గాయత్రి బ్యాంక్ నిలదొక్కుకోవడం విశేషం. ఖాతాదారుల్లో భరోసాను నింపి అంచలంచెలుగా ఎదిగింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు బ్యాంకు పనివేళలుగా నిర్ణయించడం కలిసొచ్చింది. దాంతోపాటు అతి తక్కువగా డీడీ కమిషన్‌ను తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే బ్యాంకులో కేవలం పోస్టల్ చార్జీలతోనే చెక్ క్లియరెన్స్‌లను కల్పించారు. నిమిషాల వ్యవధిలో కొత్త ఖాతాలను అందించడం సైతం కస్టమర్లను ఆకర్షించింది. ఖాతాదారులకు గాయత్రి నిర్భయ సేవింగ్స్ అకౌంట్ ద్వారా రూ.లక్ష ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించారు. జీరో బ్యాలెన్స్ అకౌంట్ సౌకర్యం కూడా ఉన్నది.





### స్వరాష్ట్రంలోనే అధిక వృద్ధి

*జగిత్యాలలో ప్రారంభమైన గాయత్రి బ్యాంక్.. తెలుగు రాష్ట్రాలతోపాటు, ఇతర రాష్ట్రాల్లోనూ విస్తరిస్తుండటం సంతోషకరం. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆదాయం పెరగడం, వ్యాపార-వాణిజ్య రంగాలకు, పరిశ్రమలకు ప్రభుత్వం పెద్దపీట వేయడంతో గొప్ప ఫలితాలు వచ్చాయి. ఈ క్రమంలోనే బ్యాంకుల ప్రాధాన్యత పెరిగింది. ప్రజలకు అందుబాటులో ఉండేలా సేవలు అందించడంతో గాయత్రి బ్యాంక్‌పై నమ్మకం ఏర్పడింది. ఒక్క మాటలో చెప్పాలంటే స్వరాష్ట్ర ఏర్పాటు మా బ్యాంక్‌కు స్వర్ణయుగాన్ని తెచ్చింది.*

*-వనమాల శ్రీనివాస్, గాయత్రి బ్యాంక్ సీఈవో*

- మొదలైన ఏడాదే రూ.68 వేల లాభాలను ప్రకటించిన గాయత్రి బ్యాంక్.
- **2012-13 ఆర్థిక సంవత్సరంలో రూ.1.01 కోట్ల లాభాన్ని, 2013-14లో రూ.2 కోట్ల లాభాలు నమోదు.**
- ప్రస్తుతం బ్యాంక్ వ్యాపారం విలువ రూ.3,204.48 కోట్లు.
- **ఖాతాదారులు 8 లక్షలు. రూ.1,837.97 కోట్ల డిపాజిట్లు.**
- 62 శాఖలతో దక్షిణ భారతంలోనే అగ్ర శ్రేణి కో-ఆపరేటివ్ బ్యాంక్‌గా గాయత్రి.
- **శాఖలున్న అన్ని గ్రామాల్లోనూ ఏటీఎం (104) సేవలు.**
- తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల్లో గాయత్రి బ్యాంక్ కార్యకలాపాలు.
- **ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, నూజివీడు, భీమవరం, శ్రీరాంపురం పట్టణాల్లోనూ శాఖలు.**
- మరో 19 శాఖలను ప్రారంభించేందుకు ఆర్బీఐ నుంచి అనుమతి.
- **తెలంగాణలో 14, ఏపీలో 5 శాఖల ఏర్పాటుకు సన్నాహాలు.**
- జూన్, జూలైల్లో ముంబై, పుణె, నాసిక్, లాథూర్, నాందేడ్ పట్టణాల్లో కొత్త బ్రాంచీలు.
- **త్వరలోనే మరో 200 మందికి బ్యాంక్‌లో ఉద్యోగావకాశాలు.**
- 2009-14 మధ్య వరుసగా 6సార్లు బ్యాంకింగ్ ఫ్రాంటైర్స్ అవార్డులు.
- **2013-14లో నేషనల్ కో-ఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా అవార్డు.**
- 19 స్కోచ్ అవార్డులతోపాటు ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా నుంచి పురస్కారం.



## తెలంగాణ వ్యాప్తంగా ర్యాపిడో సేవలు

హైదరాబాద్, మే 22: ర్యాపిడో.. తెలంగాణ వ్యాప్తంగా తన సేవలను విస్తరించింది. ఇప్పటికే పలు నగరాల్లో రైడింగ్ సేవలను అందిస్తున్న సంస్థ..తాజాగా మరో 11 పట్టణాలకు ఈ సేవలను విస్తరించింది. వీటిలో సిద్దిపేట, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నల్గొండ, రామగుండం, నిజామాబాద్, భువనగిరి, కొత్తగూడెం, సూర్యపేట్, ఆదిలాబాద్, కామారెడ్డి పట్టణాల్లో అతి తక్కువ ధరకే బైక్, ఆటోలను బుకింగ్ చేసుకోవచ్చునని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## ఐపీవోకి బ్లూవాటర్

హైదరాబాద్, మే 22:లాజిస్టిక్ సేవల సంస్థ బ్లూ వాటర్ స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టబోతున్నది. ఈ నెల 27న ప్రారంభంకానున్న వాటాల విక్రయం 29న ముగియనున్నదని తెలిపింది. షేరు ధరల శ్రేణిని రూ.132-135గా నిర్ణయించింది. రూ.10 ముఖ విలువ కలిగిన 30 లక్షల షేర్లను విక్రయించడం ద్వారా రూ.40.50 కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది.

## అంతా చూస్తున్నాం..

న్యూఢిల్లీ, మే 22: ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో అక్రమాలు, వాటిలో ఉన్నతాధికారుల పాత్ర, నిబంధనల ఉల్లంఘనల్ని అన్నింటినీ గమనిస్తూనే ఉన్నామని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే గురువారం అన్నారు. ఈ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థలో రూ.3,400 కోట్ల మోసం వెలుగుచూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రిజర్వ్ బ్యాంక్‌తో ఈ అంశంపై మాట్లాడుతామన్నారు. అలాగే సెక్యూరిటీస్ మార్కెట్ ఉల్లంఘనలపైనా దృష్టిపెట్టినట్టు చెప్పారు. మరోవైపు బ్యాంక్ తాత్కాలిక మేనేజ్‌మెంట్ తీసుకుంటున్న చర్యలు.. సంస్థ పునర్నిర్మాణానికి వేగంగా దోహదం చేయగలవన్న విశ్వాసాన్ని ప్రమోటర్ అశోక్ హిందూజా వ్యక్తం చేశారు.




## నయా లుక్‌తో టాటా అల్ట్రోజ్

ముంబై, మే 22: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ సరికొత్త మాడల్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ మాడల్ అల్ట్రోజ్‌ను సరికొత్తగా డిజైన్ చేసి మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏడు రకాల్లో లభించనున్న ఈ కారు రూ.6.89 లక్షల ప్రారంభ ధరతో లభించనున్నది. గరిష్ఠంగా రూ.11.49 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు నూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. 1.2 లీటర్ల 3 సిలిండర్ పెట్రోల్ ఇంజిన్, 1.5 లీటర్ల 4 సిలిండర్ టర్బో డీజిల్ ఇంజిన్‌తో తయారు చేసింది. వచ్చే నెల 2న బుకింగ్‌లు ఆరంభించనున్న సంస్థ..అదే నెల చివరి నుంచి బుకింగ్ చేసుకున్న కస్టమర్‌కు అందచేయనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన ఎండీ శైలేష్ చంద్ర మాట్లాడుతూ..ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్యాసింజర్ వాహన విక్రయాలు సింగిల్ డిజిట్‌కు పరిమితంకానున్నట్టు చెప్పారు.

**కారు ఫీచర్లు..**

- అన్ని వైపుల చూసే విధంగా కెమెరా
- వాయిస్‌తో ఎలక్ట్రిక్ సన్‌రూఫ్ కంట్రోల్
- వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో అండ్ యాపిల్ కార్‌ప్లే, వైర్‌లెస్ చార్జింగ్, డ్యూయల్ 65వాట్ల టైప్ సీ ఫాస్ట్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్
- 10.25 ఇంచుల అల్ట్రా వ్యూ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్
- ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఈఎస్‌పీ స్టాండర్డ్‌తో తీర్చిదిద్దింది

## మార్కెట్లకు బాండ్ దెబ్బ

**భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ సూచీలు • సెన్సెక్స్ 645, నిఫ్టీ 204 పాయింట్లు డౌన్**

**తీవ్ర అమ్మకాల ఒత్తిడిలో ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు**

ముంబై, మే 22: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీగా నష్టపోయాయి. పెరిగిన అమెరికా బాండ్ ఈల్డ్స్ ఒకవైపు.. ఎగబాకుతున్న ఆ దేశ అప్పుల భారం మరోవైపు.. భారతీయ సూచీలను కుదిపేశాయి. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 644.64 పాయింట్లు లేదా 0.79 శాతం పడిపోయి 80,951.99 వద్ద నిలిచింది. ఒకానొక దశలోనైతే 1,106.71 పాయింట్లు క్షీణించడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 203.75 పాయింట్లు లేదా 0.82 శాతం కోల్పోయి 24,609.70 వద్ద స్థిరపడింది. ఎఫ్‌ఎంసీజీ (1.25 శాతం), ఐటీ (1.19 శాతం), చమురు-గ్యాస్ (1.13 శాతం), ఆటో (0.87 శాతం) రంగాల షేర్లు విపరీతంగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.33 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.17 శాతం మేర దిగజారాయి. షేర్లవారీగా మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్, ఐటీసీ, హిందుస్థాన్ యునిలీవర్, రిలయన్స్ ఇండస్ట్రీస్, మారుతీ షేర్లు నిరాశపర్చాయి. ఇక ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు నష్టాలకే పరిమితమయ్యాయి.



*అమెరికా బాండ్ల (5 శాతం), జపాన్ బాండ్ (3.5 శాతం) ఈల్డ్స్ భారీగా పెరగడం.. దేశ, విదేశీ స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేసింది. ఈ క్రమంలో మదుపరులు భారతీయ ఈక్విటీల్లో పెట్టుబడులనూ ప్రమాదంగా పరిగణించారు. దీంతో లాభాల స్వీకరణకు దిగారు.*

*-ప్రశాంత్ తాప్సే, మెహతా ఈక్విటీస్*



అమెరికా అప్పుల భారం ఆందోళనకర స్థాయికి పెరుగుతుండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఆ దేశ క్రెడిట్ రేటింగ్‌ను మూడీస్ దిగజార్చడం సైతం ఇన్వెస్టర్లలో గుబులు పుట్టించింది.

*-వినోద్ నాయర్, జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్*

## రాష్ట్రంలో ల్యాప్‌టాప్‌లు, పీసీల తయారీ!

- **సిక్స్‌యునైటెడ్‌తో రిసొల్యూట్**

హైదరాబాద్, మే 22(నమస్తే తెలంగాణ): చైనాకు చెందిన ఎలక్ట్రానిక్స్ పరికరాల సంస్థ సిక్స్‌యునైటెడ్... హైదరాబాద్ కేంద్రంగా వివిధ రకాల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను తయారుచేస్తున్న రిసొల్యూట్ గ్రూప్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా సిక్స్‌యునైటెడ్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో ల్యాప్‌టాప్‌లు, పీసీలను తయారు చేయడానికి ప్రత్యేకంగా ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నది. తైవాన్ రాజధాని తైపీలో జరుగుతున్న ప్రపంచస్థాయి ట్రేడ్ షో 'కంప్యూటెక్స్'లో భాగంగా గురువారం రాష్ట్ర ఇండస్ట్రీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవో నరసింహారెడ్డి సమక్షంలో రిసొల్యూట్ గ్రూప్ చైర్మన్ రమీందర్ సింగ్, సిక్స్‌యునైటెడ్ సీఈవో మైఖేల్‌లు ఒప్పందంపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ కల్పనతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి ఈ ఒప్పందం తోడ్పడుతుందని, హై-టెక్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ కేంద్రంగా హైదరాబాద్ నిలుస్తున్నదని రిసొల్యూట్ వర్గాలు తెలిపాయి.



## షేరుహోల్డర్లకు ఐటీసీ బొనాంజా

న్యూఢిలీ మే 22: దేశీయ ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ఐటీసీ..షేరు హోల్డర్లకు బొనాంజాను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతీషేరుకు రూ.7.85 లేదా 785 శాతం డివిడెండ్‌ను ప్రకటించింది. వచ్చే నెలలో ఇందుకు సంబంధించి వాటాదారులకు చెల్లింపులు జరపనున్నట్టు తెలిపింది. మరోవైపు, గడిచిన త్రైమాసికానికిగాను రూ.20,376.3 కోట్ల ఆదాయంపై రూ.19,807.8 కోట్ల నికర లాభాన్ని గడించింది.

## సింగిల్‌విండో ద్వారా హెచ్‌టీ సర్వీసుల మంజూరు

మంచిర్యాలటౌన్, మే 22 : వినియోగదారులకు హెచ్‌టీ 11 కేవీ, 33 కేవీ, ఆపై వోల్టేజీ సర్వీసుల మంజూరు వేగవంతం చేసేందుకు సింగిల్ విండో వ్యవస్థను ప్రవేశపెట్టామని మంచిర్యాల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ గంగాధర్ తెలిపారు. ఈ సర్వీసుల మంజూరును మరింత సరళీకృతం చేసేందుకు హెచ్‌టీ మానిటర్ సెల్‌ను సర్కిల్ ఆఫీస్, కార్పొరేట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 11 కేవీ వోల్టేజీ దరఖాస్తులను సర్కిల్ ఆఫీస్‌లోని ఏడీఈ కమర్షియల్ అధికారి.., 33 కేవీ వోల్టేజి, ఆపై వోల్టేజీ దరఖాస్తులను ఏడీఈ కమర్షియల్ కార్పొరేట్ ఆఫీస్ మానిటర్ చేస్తారని వివరించారు. ఈ వ్యవస్థ వల్ల త్వరితగతిన సర్వీసులు మంజూరవుతాని, ప్రతీసారి కార్యాలయాలకు రాకుండా ట్రాక్ చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు. అత్యంత పారదర్శకత పెరుగుతుందని, వినియోగదారులు దరఖాస్తుల స్థితిగతులను ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్‌ల రూపేణా సమాచారం పంపబడుతుందని వివరించారు.

## నేడు రైతులకు అవగాహన

తాండూర్, మే 22 : పోలీసు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా శుక్రవారం నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి ఐబీ అండర్ బ్రిడ్జి వరకు ర్యాలీ తీసి, అనంతరం నకిలీ విత్తనాలతో పాటు వ్యవసాయానికి సంబంధించిన సస్యరక్షణ గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

**ఇ-టెండర్ నోటీస్ నెం. C/E.29/Elec/M/SC/11/OEW/OT/2025-26, తేది: 21-05-2025**

PUB/0586

దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ సంతకందారు భారత రాష్ట్రపతి తరపున 13-06-2025న 15.00 గం.వరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

**క్ర.సం: 01, ఇ-టెండర్ నెం:** C/E.29/Elec/M/SC/11/OEW/OT/2025-26,ఇ-టెండర్ నెం. E-M-SC-11-OT-2025-26, **పని పేరు:** సికింద్రాబాద్ డివిజన్- ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్- మురుగుత్తి టన్నెల్‌లో కొత్త వైరింగ్ కొరకు ప్రతిపాదన- విద్యుత్ ఏర్పాట్లు. **టెండర్ విలువ:** రూ.82,43,143.40/-, **బయానా:** రూ.1,64,900.00/-, CTF: రూ.0.00 **పూర్తి చేయు కాలం:** 6 నెలలు.

**సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, (M), సికింద్రాబాద్**
A0724

**తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.**

# మౌలిక వసతుల కల్పనకు కృషి

సీసీసీ నస్పూర్, మే 22 : కార్మికులకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. నస్పూర్‌కాలనీలో గురువారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా నస్పూర్‌కాలనీ మనోరంజన్ సముదాయ్‌ని సందర్శించారు. వాకింగ్ ట్రాక్ పరిశీలించి, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నిర్మాణంలో ఉన్న ఫంక్షన్ హాలులో సదుపాయాలు కల్పించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే ఆర్కే-5 కాలనీలో గల స్విమ్మింగ్‌పూల్‌ను సందర్శించారు. పరిసరాల్లో లైటింగ్ సిస్టం మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు. అనంతరం కృష్ణాకాలనీలో ఏర్పాటు చేయబోయే చిల్డ్రన్ పార్కు ప్రదేశాన్ని పరిశీలించి, త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. శాంతి స్టేడియంలో వాకింగ్ ట్రాక్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, సివిల్ డీజీఎం ఆనంద్‌కుమార్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సత్యనారాయణ, భరత్ భూషణ్, సీనియర్ పీవో రణదీప్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

**క్రీడాకారులకు బహుమతులు..**

2024-25 వార్షిక క్రీడల్లో కోలిండియా, ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ టోర్నీలో పతకాలు సాధించిన శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారులకు యాజమాన్యం తరపున జీఎం శ్రీనివాస్ బహుమతులు అందించి, సన్మానించారు. వివిధ క్రీడాంశాల్లో కోలిండియా, పబ్లిక్ సెక్టార్లలో ఉత్తమ ప్రతిభ చూపడం సంతోషదాయకమన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ అసిస్టెంట్ కార్యదర్శి కొమురయ్య, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ సకినాల నర్సయ్య, ఇండోర్ కేప్టెన్ తోట సురేశ్, జీఎం చర్చల కమిటీ సభ్యుడు రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.



సీసీసీలోని స్విమ్మింగ్‌పూల్ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న జీఎం శ్రీనివాస్

**వైభవంగా ఆవిర్భావ వేడుకలు**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తామని జీఎం శ్రీనివాస్ తెలిపారు. జూన్ 2న నిర్వహించే వేడుకలపై తన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందిరినీ అలరించేలా చూడాలని, వేడుకలకు హాజరయ్యే వారికి అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఉదయం 8 గంటలకు నస్పూర్‌కాలనీ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడి నుంచి షిర్కే సెంటర్ వరకు ర్యాలీ తీయనున్నట్లు తెలిపారు. 9 గంటలకు జీఎం ఆఫీస్ వద్ద అమరవీరుల స్తూపం, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పించనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం ప్రగతి స్టేడియంలో వివిధ స్టాళ్ల ప్రారంభం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఫైనాన్స్ ఏజీఎం బీభత్స, ఓసీపీ పీవోలు శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజెంట్ శ్రీధర్, వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, ఎంవీటీసీ మేనేజర్ వెంకటరామారావు, ఎన్విరాన్‌మెంట్ అధికారి హనుమాన్ గౌడ్, సీనియర్ పీవో కాంతారావు, ఫారెస్ట్ అధికారి మేఘన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా ఫ్రంట్ నాయకులు

## మావోయిస్టులతో చర్చలు జరుపాలి

మంచిర్యాల (ఏసీసీ), మే 22 : కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ అడవుల్లో 27 మంది మావోయిస్టులను కేంద్ర బలగాలు కాల్చి చంపడాన్ని తమ పార్టీ కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని పేర్కొన్నారు. ఓవైపు మావోయిస్టులతో చర్చలు జరపుదామని, సమస్యను శాంతియుతంగా పరిష్కరిస్తామని చెబుతూనే నరమేధం చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, జయపాల సింగ్, చంద్రయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకోవాలి

కన్నెపల్లి, మే 22 : రైతులు రైతు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని భీమిని వ్యవసాయ సహాయ సంచాలకురాలు సురేఖ తెలిపారు. ఎల్లారం గ్రామంలో గురువారం రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలించారు. ఈ నెల 31వ తేదీలోగా వ్యవసాయాధికారులను సంప్రదించి, గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏఈవో సంతోష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

## కాలం చెల్లిన వస్తువులు అమ్మితే చర్యలు

రామకృష్ణాపూర్, మే 22 : క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కిరాణా యజమానులు కాలంచెల్లిన వస్తువులు, తినుబండారాలు విక్రయిస్తే షాపులను సీజ్ చేస్తామని కమిషనర్ గద్దె రాజు హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధి అమ్మగార్డెన్ ఏరియాలో కిరాణా యజమానులు కాలం చెల్లిన వస్తువులు, తినుబండారాలు విక్రయిస్తున్నారని పలువురు నాయకులు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్.. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, సంతోష్‌ను అక్కడికి పంపించి తనిఖీలు చేయించారు. అమ్మగార్డెన్ రోడ్డు నంబర్ 33లోని కనకదుర్గా కిరాణంలో కాలం చెల్లిన వస్తువులు, తినుబండారాలు విక్రయిస్తున్నారని నిర్ధారించుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.



షాపును సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మున్సిపల్ పరిధిలోని దుకాణాల యజమానులు మున్సిపల్ టాక్స్, ట్రేడ్ లైసెన్స్, ఫుడ్ సెక్యూరిటీ లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



ప్రమాదకర విద్యుత్ స్థభం

బేల, మే 22 : డోప్టాల శివారులో రైతు మంచాల రామకృష్ణ చేనులో ఓ విద్యుత్ స్తంభం పూర్తిగా వంగిపోయి ఉన్నది. ఎప్పుడు విరిగి పడుతుందో, తీగలతో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని రైతుసహా పరిసర రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా ఈ స్తంభం తొలగించి కొత్తది వేయాలని కోరుతున్నారు.



ఎస్టీపీపీలో కారుణ్య నియామక పత్రాన్ని అందుకుంటున్న గంధం మహేశ్

## కారుణ్య నియామక పత్రం అందజేత

జైపూర్, మే 22 : ఎస్టీపీపీలో సీనియర్ సెక్యూరిటీ గార్డుగా పనిచేసిన గంధం వెంకటి అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ అవగా, ఆయన కొడుకు గందం మహేశ్‌కు గురువారం ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు కారుణ్య నియామక పత్రాన్ని అందించారు. ఈడీ చిరంజీవి మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం పొందడం వరంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, సీఎంఓఏఐ బ్రాంచ్ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ తుకారాం, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.




గనిలోకి వెళ్తున్న మినిస్ట్రీ ఆఫ్ కోల్ అధికారులు

## ఆర్కే-7 గని సందర్శన

సీసీసీ నస్పూర్, మే 22 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-7 భూగర్భ గనిని మినిస్ట్రీ ఆఫ్ కోల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎండీ అఫ్తబ్ అలామ్, సెక్షన్ అధికారి విజయ్‌సింగ్, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌తో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు గనిలో బొగ్గు తవ్వకాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. బొగ్గు రవాణా, గనిలో తీసుకుంటున్న రక్షణ చర్యల గురించి అధికారులను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఉత్పత్తి, రవాణా, భద్రతాపరమైన చర్యలపై సమగ్రంగా అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో గని ఏజెంట్ రాజేందర్, మేనేజర్ తిరుపతి, గ్రూప్ ఇంజినీర్ రాజా రవిచరణ్, రక్షణాధికారి సంతోష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకే రాజీవ్ యువ వికాసం

ఆసిఫాబాద్ టౌన్, మే 22 : రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులనే ఎంపిక చేస్తామని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సంబంధిత అధికారులతో కలిసి రిఫికేషన్, బ్యాంక్ సిబిల్ స్కోర్ పరిశీలన ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అభ్యర్థుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని గుండి గ్రామంలో అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించి, పనుల పురోగతిపై సమీక్షించారు. ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ